నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 20 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

**ఉచిత బస్సు పథకం మరో ఉసురు తీసినట్లయింది. 15 ఏళ్లుగా కలలుగన్న ఓ యువకుడు ఏడాది క్రితమే ఫైనాన్స్‌లో కొత్త ఆటోను కొన్నాడు. సరిగ్గా అదే సమయంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో రోడ్డున పడ్డ ఎందరో ఆటో డ్రైవర్లలో ఈ యువకుడు కూడా ఉన్నాడు. ఆటోను కొత్తగా కొనుగోలు చేసినప్పటికీ మహిళలెవరూ పెద్దగా ఆటో ఎక్కకపోవడం, ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేలు ఇవ్వకపోవడం, ఇటు రోజువారీ ఆదాయం కూడా సరిగా రాకపోవడం, కిస్తీలు కట్టేంత కిరాయిలూ లభించకపోవడం, వాటిని తీర్చేందుకు, కుటుంబ పోషణకు మరికొంత అప్పులు చేయాల్సి రావడం, చివరికి వాటిని తీర్చే మార్గం కూడా కన్పించకపోవడం వంటి కారణాలతో ఆ యువకుడు ఉరేసుకొని ఉసురు తీసుకున్నాడు. ఈ విషాదకర ఘటన భద్రాద్రి జిల్లా ఇల్లెందులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.**

*– ఇల్లెందు, జనవరి 19*

# ఉచిత బస్సుకు మరో ఉసురు

- 'మహాలక్ష్మి'తో ఆటో నడవక ఇల్లెందులో డ్రైవర్ బలవన్మరణం
- ఫైనాన్స్ కిస్తీలకు కిరాయిలురాక, అప్పులబాధ తాళలేక ఆత్మహత్య
- 15 ఏళ్లుగా ఆటో వృత్తి.. ఏడాది క్రితమే కొత్త వాహనం కొనుగోలు
- సరిగ్గా అప్పుడే ఉచిత బస్సు పథకాన్ని తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మహిళలు ఎక్కక కిస్తీలు ఆలస్యం.. కుటుంబ పోషణ ఇక్కట్లు తీవ్రం..
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేల కోసం ఎదురుచూపులు
- అవిరాక, అప్పులు తీరే మార్గంలేక ఉరేసుకున్న ఆటోడ్రైవర్ సుమంత్


సుమంత్ (ఫైల్)


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మహాలక్ష్మి పథకం ఆటో కార్మికుల బతుకులపై అంతులేని ప్రభావాన్ని చూపుతోందనేందుకు వరుసగా జరుగుతున్న ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. తాజాగా ఇల్లెందులో మరో ఆటో డ్రైవర్ ఉసురు తీసుకోవడం.. ఆ పథక పర్యవసానాలను తెలియజేస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లెందు మున్సిపాలిటీ ఒకటో వార్డుకు చెందిన రెడ్డబోయిన సుమంత్‌ది (36) నిరుపేద కుటుంబం. ఆటో వృత్తిపై మమకారం పెంచుకున్న అతడు.. ఆటో డ్రైవింగ్ నేర్చుకున్నాడు. 15 ఏళ్లుగా అద్దె ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఎలాగైనా సొంతంగా ఆటో కొనుక్కొని భార్యను, ఇద్దరు కుమార్తెలను పోషించుకోవాలనుకున్నాడు. ఇందుకోసం ఏడాది క్రితం ఫైనాన్స్‌లో కొత్త ఆటోను కొనుగోలు చేశాడు. సరిగ్గా అదే సమయంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో కోటి ఆశలతో కొత్త ఆటో కొనుగోలు చేసిన సుమంత్‌కు కష్టాలు మొదలయ్యాయి. ఎలాగైనా రేయింబవళ్లూ ఆటో తోలి కుటుంబాన్ని పోషించుకోవాలనుకున్నాడు. కానీ మహిళలు పెద్దగా ఆటో ఎక్కపోవడంతో అతడికి రోజువారీ ఖర్చుల కోసం కూడా కిరాయిలు లభించేవి కావు. ఇక నెలవారీ కిస్తీల కోసం పడరాని పాట్లు పడేవాడు. ఒకవేళ సమయానికి కిస్తీలు చెల్లించకపోతే ఫైనాన్స్ సంస్థ బాధ్యులు తన ఆటోను తీసుకెళ్తారేమోనని ఆందోళనపడేవాడు. చివరికి అప్పులు చేసి మరీ కిస్తీలు చెల్లిస్తుండేవాడు.

ఆటో నడవని కారణంగా కుటుంబ పోషణ కోసం కూడా మరికొంత అప్పు చేశాడు. ఈ రెండు అప్పులూ కలిపి రూ.6 లక్షలయ్యాయి. దీంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూశాడు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందేమోనని ఆశగా చూశాడు. ఏడాది దాటినా ఆ హామీ కూడా అమలు కాలేదు. అతడికి రూ.12 వేలు కూడా రాలేదు. ఇక ఈ అప్పులు తీర్చే మార్గం కన్పించడంలేదంటూ కొంతకాలంగా తోటి ఆటో డ్రైవర్లతో తన ఆవేదనను పంచుకునేవాడు. ఈ క్రమంలో ఆ అప్పుల బాధను తాళలేక ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో సుమంత్ తన ఇంట్లోనే ఉరేసుకొని ఉసురు తీసుకున్నాడు. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు కూతుర్లు చాందిని (7వ తరగతి), చిన్ని (5వ తరగతి) ఉన్నారు.


విషణ్ణవదనంతో మృతుడి కుమార్తెలు

### ఆటో డ్రైవర్‌కు పలువురి నివాళి

అప్పులబాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ రెడ్డబోయిన సుమంత్ మృతదేహం వద్దకు తోటి ఆటోడ్రైవర్లు ఆదివారం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పలువురు ప్రముఖులు కూడా వచ్చి అతడి మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, దొండ డానియేల్, బావుసింగ్‌నాయక్, కటకం పద్మావతి, నాయకులు దాస్యం ప్రమోద్ కుమార్, అబ్దుల్ నబీ, సత్తాల హరికృష్ణ, హరిప్రసాద్, సురేశ్, రాజపల్లి శ్రీను, దేరంగుల పోశం తదితరులు ఉన్నారు. కాగా, కనకయ్య, హరిప్రియలు మృతుడికి కుటుంబానికి చెరో రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ఉసురు తీస్తోందని, సుమంత్‌ది కూడా ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అవుతుందని విమర్శించారు. సుమంత్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.


రైతుభరోసా సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలతో కర్షకుల్లో కలవరం మొదలైంది. రైతు సంక్షేమ పథకాల్లో కోతలు తప్పవేమోననే భయం వెంటాడుతోంది. రూ.2 లక్షల రుణమాఫీ అంటూ మొన్నటి వరకూ ఊదరగొట్టిన రేవంత్ సర్కారు.. అందులో సింహభాగం మందికి పైగా ఎగనామం పెట్టిన విషయాన్ని అన్నదాతలు గుర్తుచేసుకుంటున్నారు. దీంతో తాజాగా మొదలైన రైతుభరోసా సర్వేపై కూడా ఇదేవిధమైన సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సాగుకు యోగ్యమైన భూములకే రైతుభరోసా అని చెబుతున్నప్పటికీ దానిని 'అందరికీ ఇస్తారా? లేక కొందరికే పరిమితం చేస్తారా?' అనే అనుమానాలను ముందుకు తెస్తున్నారు. ఎందుకంటే రైతుభరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ ఇన్నాళ్లూ నమ్మబలికిన ప్రభుత్వం.. ఆ మొత్తాన్ని కూడా రూ.12 వేలకు కుదించడాన్ని గుర్తుచేస్తున్నారు. ఇక ఈ రూ.12 వేలను కూడా పంటలు సాగు చేస్తున్న రైతులకేనంటూ మెలికలు పెట్టడం కూడా మోసంలో భాగమేమోననే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 5.56 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా అన్ని ఎకరాలకూ గత కేసీఆర్ ప్రభుత్వం రూ.10 వేల చొప్పున రైతుబంధును వర్తింపజేసిన విషయాన్ని వివరిస్తున్నారు. మరి 'గడిచిన రెండు సీజన్ల పంటల పెట్టుబడి సాయాన్ని ఎగవేసినట్లేనా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

*– భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/చుంచుపల్లి, జనవరి 19*

# అందరికా? కొందరికా?

## కర్షకుల్లో కలవరం.. 'కోతలు' తప్పవేమోనంటూ భయం..

- భద్రాద్రి జిల్లాలో కొనసాగుతున్న 'రైతుభరోసా' సర్వే..
- సాగుకు యోగ్యమైన భూములకేనంటూ మెలిక
- పైగా రూ.15 వేల 'భరోసా' రూ.12 వేలకు కుదింపు..
- అన్నదాతల్లో సర్వత్రా ఆందోళన.. ఇప్పటికే రుణమాఫీలో కోత..
- జిల్లాలో 354 రెవెన్యూ గ్రామాలు.. 5.56 లక్షల ఎకరాలు..
- ఇందులో ఎన్ని ఎకరాలకు వర్తింపజేస్తారోనంటూ సందేహాలు
- 21, 22, 23 తేదీల్లో జరిగే గ్రామసభల్లో తేలనున్న అర్హులు
- మరి గడిచిన రెండు పంటలకు రైతుభరోసా రానట్టేనా?


సర్వే నిర్వహిస్తున్న చుంచుపల్లి మండల వ్యవసాయ అధికారి రాజేశ్వరి, రెవెన్యూ అధికారులు

రైతు సంక్షేమ పథకాల అమలులో రేవంత్ ప్రభుత్వం మరోసారి మాట తప్పింది. రుణమాఫీకి తూట్లు పొడిచినట్లుగానే రైతుభరోసాలోనూ కోతలు పెడుతోంది. రూ.15 వేల సాయాన్ని రూ.12 వేలకు తగ్గించినప్పటికీ అందులో అనేక కొర్రీలు పెట్టి కర్షకుల సంఖ్యను మరింత కుదించేందుకు కుటిల యత్నాలు చేస్తున్నట్లు స్పష్టమవుతోందంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు సీజన్ల పంటల పెట్టుబడి సాయం విడుదల గురించి స్పష్టత ఇవ్వకుండానే తాజాగా రైతుభరోసా సర్వేకు చేపట్టింది. ఈ నెల 26 నుంచి రైతుభరోసా ఇస్తామని చెబుతోంది. దానికి సమాంతరంగా సర్వేలు కొనసాగిస్తుండడం, సాగు యోగ్యమైన భూములకేనంటూ స్పష్టం చేస్తుండడం వంటి కారణాలతో ఈ పంటల సాయం కూడా 'అందరికా? లేక కొందరికా?' అనే సందిగ్ధం నెలకొంది. ఇదిలా ఉండగానే క్షేత్రస్థాయిలో సర్వేలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామస్థాయి నుంచి ఆర్ఐలు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు కలిసి గ్రామస్థాయిలో సాగుకు యోగ్యమైన భూములను గుర్తిస్తున్నారు. ఈ సర్వేలకు సూపర్ చెక్‌గా మండల స్థాయిలో మండల ఉన్నత అధికారులు తనిఖీలు చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 354 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఆయా బృందాల సభ్యులు క్లస్టర్ల వారీగా భూములను సర్వే చేస్తున్నారు. ధరణి పట్టాదారు పాస్‌బుక్‌లు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతుల భూములను పరిశీలిస్తున్నారు.

### అన్నదాతల్లో అయోమయం

ప్రభుత్వ ప్రకటనలు, మంత్రుల మాటలు భిన్నంగా ఉంటుండడంతో అన్నదాతల్లో అయోమయం నెలకొంది. ఇటీవల మంత్రులు కూడా భిన్న ప్రకటనలు చేస్తుండడం ఇందుకు కారణమవుతోంది. అర్హులైన రైతులెవరికీ అన్యాయం జరగదంటూ ఓ మంత్రి చెబుతుండగా.. కేవలం సాగుకు యోగ్యమైన భూములకేనంటూ మరో మంత్రి చెబుతున్నారు. దీంతో ప్రభుత్వంపై రైతుల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత కేసీఆర్ సర్కారు రైతులందరికీ ధరణి పాసుపుస్తకాలను జారీ చేసింది. పోడు రైతులు, సాధారణ రైతులు కలిపి మొత్తంగా 5.56 లక్షల ఎకరాల భూమిని సాగు చేస్తున్నారు. రాష్ట్రంలోకెల్లా భద్రాద్రి జిల్లాలోనే అత్యధిక మంది రైతులకు గత కేసీఆర్ సర్కారు పోడు పట్టాలను మంజూరు చేసింది. వీరిలో అందరికీ క్రమం తప్పకుండా రైతుబంధును అందించింది. రైతుబీమాను వర్తింపజేసింది. ఎక్కడా ఏ కోతలూ పెట్టలేదు. కానీ కాంగ్రెస్ సర్కారు కోతలు పెడుతుండడంతో కర్షకుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

### 21, 22, 23 తేదీల్లో తేలనున్న అర్హులు

భద్రాద్రి జిల్లాలో 354 రెవెన్యూ గ్రామాలకు గాను 194 గ్రామాల్లో రైతుభరోసా సర్వే పూర్తయినట్లు సమాచారం. 'రైతుభరోసా ఇవ్వడానికి ఎలాంటి పొలం అర్హత పొందుతుంది?' అనే అంశంపై అధికారులు పరిశీలన చేస్తున్నారు. మండలస్థాయిలో సూపర్ చెకింగ్ చేసినా చివరికి గ్రామసభల ద్వారానే అర్హులైన రైతులను ఎంపిక చేయనున్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో పంచాయతీ స్థాయిలో గ్రామసభలను నిర్వహించి అర్హులను గుర్తించనున్నారు.

### రెండు సీజన్ల రైతుభరోసానూ ఇవ్వాలి..



గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతుబంధు ఎప్పుడూ ఆగలేదు. ప్రతి సీజన్‌లోనూ పంట కాలానికి ముందుగానే మా రైతుల బ్యాంకు ఖాతాల్లో పంటల పెట్టుబడి సాయం జమ అయ్యేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గడిచిన సీజన్లకు రైతుభరోసా ఇవ్వలేదు. తాజా రైతుభరోసాకూ పాత రెండు సీజన్ల పంటల పెట్టుబడిని కలిపి ఇవ్వాలి.

–పెద్దిని వేణు. రైతు సంఘం నాయకుడు, చంద్రుగొండ

### అయోమయంగా ఉంది..



రైతుభరోసా విషయంలో అంతా అయోమయంగా ఉంది. మాకు ఆరు ఎకరాల సాగు భూమి ఉంది. గత ప్రభుత్వంలో రైతుబంధు క్రమం తప్పకుండా వచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతుభరోసా రావడం లేదు. అసలు వస్తుందో రాదో తెలియడం లేదు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తారో? లేక ఇకనైనా ఇస్తారో? అనే స్పష్టత కోసం చూస్తున్నాం.

–భూక్యా లక్ష్మి, రైతు, సుజాతనగర్

### కౌలు రైతుల పరిస్థితేంటి?



కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు మాట తప్పింది. తాజా రైతుభరోసాలో కౌలు రైతుల ఊసే ఎత్తడంలేదు. సర్వేల్లో కూడా మా గురించి చెప్పడం లేదు. సాగు యోగ్యమైన భూముల వివరాలను అధికారులు నమోదుచేసుకొని వెళ్తున్నారు. ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకొని మాలాంటి రైతులకు కూడా పంటల సాయం అందించాలి.

–షేక్ అహ్మద్, పెనగడప, కౌలు రైతు

### పంటలు వేసే భూములకు భరోసా..



పంటలు సాగు చేసే భూములకు రైతుభరోసా వర్తిస్తుంది. అర్హమైన భూముల గుర్తింపు కోసం చేపట్టిన సర్వేలు పూర్తి కావస్తున్నాయి. ఒక్కో మండలంలో మూడు బృందాలు సర్వేలు చేస్తున్నాయి. గ్రామసభలు అయ్యాక ఈ నెల 26న రైతుభరోసా పంటల సాయం నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–బాబూరావు, డీఏవో, భద్రాద్రి

## అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

### గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ: భద్రాద్రి కలెక్టర్

# గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు


భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించేందుకు నిర్వహించబోయే గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. 'రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల క్షేత్ర పరిశీలన, గ్రామసభలు' అనే అంశాలపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమీషనర్లతో ఆదివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పలువురు అధికారులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు. అలాగే, సర్వే ప్రగతి గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 24 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల మాదిరిగానే 21 నుంచి చేపట్టే గ్రామసభలను నిర్వహించాలన్నారు. ప్రతి రోజూ ఒక పంచాయతీలో మాత్రమే గ్రామసభ నిర్వహించాలని సూచించారు. వీటిల్లో వివిధ పథకాల కోసం ప్రజలు అందించే దరఖాస్తులను కూడా స్వీకరించాలని ఆదేశించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో..
# కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

- నీటిమూటలైన గ్యారెంటీ హామీలను ప్రజలకు తెలియజేయాలి
- ఇందుకోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలి
- ముదిగొండ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

ముదిగొండ, జనవరి 19: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు పిలుపునిచ్చారు. మండలంలోని పమ్మి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని, కలిసివచ్చే శక్తులతో జతకట్టి అధికార పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగింది శూన్యమని, ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయకుండా కాలం వెల్లదీస్తున్నదని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయని తూర్పారబట్టారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సహా అన్ని ఏ ఒక్క పథకంపైనా స్పష్టత లేకుండా సర్వేల పేరుతో కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంటోందని ఆరోపించారు. పథకాల పేరుతో వంచన చేయాలని చూస్తుందని విమర్శించారు. ఈ నెల 21 నుంచి 24 వరకూ జరిగే గ్రామసభల్లో అర్హులందరికీ పథకాలు అందేలా ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ శ్రేణులను కోరారు. ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృత ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, బంక మల్లయ్య, హరిప్రసాద్, ఉపేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు

# మన అప్రమత్తతే.. మనకు రక్ష

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం ప్రగతి మైదాన్/ కొత్తగూడెం అర్బన్, జనవరి 19: పౌరులంతా అప్రమత్తంగా ఉంటూ రోడ్డు నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే.. రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు మాట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయంతో కొత్తగూడెంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. తమకు ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణవ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కరపత్రాన్ని ఎస్పీ రోహిత్ రాజు, డీటీవో వెంకటరమణ, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య, కొత్తగూడెం తహసీల్దార్ డి.పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయ స్వామి, ఆర్టీసీ డీఎం, ఆర్అండ్‌బీ డీఈ కలిసి ఆవిష్కరించారు.

# ఆటలతో శారీరక దృఢత్వం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్


క్రికెట్ పోటీల్లో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

రామవరం, జనవరి 19: ఆటలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం పెరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రామవరం సాధన గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... పని ఒత్తిడి నుంచి బయటపడేందుకు, శారీరక–మానసిక ఉత్తేజానికి, ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. అందుకే, ప్రతి ఒక్కరూ రోజులో కొంతసేపైనా ఆడాలని కోరారు. న్యాయమూర్తులు శివ నాయక్, శిరీష, న్యాయవాదులు పలివెల సాంబశివరావు, గాజుల రామ్మూర్తి, పాతూరి పాండురంగ విఠల్, అరకల రవిఇకుమార్ పాల్గొన్నారు.